భూగోళ శాస్త్రం - కంటెంట్ (ఎస్‌ఏ)

# భారతదేశ ఉనికి – క్షేత్రీయ అమరిక

ఆసియాలో దక్షిణ భాగాన భారత ఉపఖండం ఉంది. దీనికి ఉత్తరాన హిమాలయాలు, ఆగ్నేయంలో బంగాళాఖాతం, నైరుతిలో అరేబియా సముద్రం ఉన్నాయి. భౌగోళికంగా 8°.4'.- 37°.6' ఉత్తర అక్షాంశాలు, 68°.7'- 97°25' తూర్పు రేఖాంశాల మధ్య ఉత్తరార్ధ, పూర్వార్ధ గోళంలో పాక్షికంగా విస్తరించి ఉంది. ఇది అక్షాంశాల పరంగా ఉత్తర దక్షిణాలుగా 30°ల పొడవు, రేఖాంశాల పరంగా కూడా తూర్పు, పడమరలుగా 30°ల డిగ్రీల వెడల్పులో వ్యాపించి ఉంది. 3.28మిలియన్ చ.కి.మీ విస్తీర్ణంతో ఉన్న భారతదేశం ప్రపంచంలోని పెద్ద దేశాల్లో ఏడోది.

ఉత్తర దక్షిణాలుగా సుమారు 3214 కి.మీ పొడవు, తూర్పు పడమరలుగా 2933 కి.మీ వెడల్పుతో భారతదేశం విస్తరించి ఉంది. దేశం ఉత్తర చివరన మంచుతో కప్పిన హిమాలయ పర్వతాలు, దక్షిణాన కన్యాకుమారి, పశ్చిమాన ఉప్పు నీటితో కూడిన చిత్తడి నేలలున్న రాణా ఆఫ్ కచ్, తూర్పున దట్టమైన అడవులు, అభేద్యమైన కొండలతో మయన్మార్, చైనా భారత దేశాల సరిహద్దు భాగాలుగా ఉన్నాయి. రేఖాంశాల పరంగా తూర్పు పడమరలుగా భారత దేశం 30°ల మేర విస్తరించి ఉన్నందున పశ్చిమాన గుజరాత్‌లోని ద్వారకా వద్ద కంటే, తూర్పు అంచున ఉన్న అరుణాచల్‌ప్రదేశ్‌లో మొదట సూర్యోదయం అవుతుంది. దేశంలో వివిధ ప్రదేశాల స్థానిక కాలాల్లోని భేదాన్ని తొలగించడానికి $82^1/_2$° తూర్పు రేఖాంశాన్ని కాల నిర్ణయానికి ప్రామాణిక రేఖాంశంగా నిర్ణయించారు. దీన్నే భారతదేశ ప్రామాణిక కాలంగా వ్యవహరిస్తున్నారు. గ్రీనిచ్ కాలానికి, భారత ప్రామాణిక కాలానికి $5^1/_2$° గంటల వ్యత్యాసం ఉంది. భారతదేశానికి మొత్తం 15,200 కి.మీ. పొడవైన భూభాగపు సరిహద్దు, 6,100 కి.మీ. పొడవైన తీరరేఖ ఉన్నాయి.

## భారతదేశం– సరిహద్దు దేశాలు, రాష్ట్రాలు

పాకిస్థాన్, అఫ్గానిస్తాన్, చైనా, నేపాల్, భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్ భారత్‌కు సరిహద్దులో ఉన్న (పొరుగు) దేశాలు. సముద్ర జలాల్లో అతి సమీపంలో ఉన్న పొరుగు దేశం శ్రీలంక. శ్రీలంక, భారతదేశాన్ని మన్నార్ సింధు శాఖ, పాక్ జల సంధి వేరుచేస్తున్నాయి.

## రాజకీయ విభాగాలు

భారతదేశంలో మొత్తం 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్... ఐదు పెద్ద రాష్ట్రాలు. గోవా, సిక్కిం, త్రిపుర, నాగాలాండ్, మిజోరాం... ఐదు చిన్న రాష్ట్రాలు.

**దీవులు:** అతి పెద్ద కేంద్రపాలిత ప్రాంతం అండమాన్ నికోబార్ దీవులు కాగా, అతి చిన్న ప్రాంతం లక్షదీవులు. భారతదేశంలో మొత్తం 247 దీవులున్నాయి. వీటిలో 223 బంగాళాఖాతంలో, మిగిలినవి అరేబియా సముద్రం, మన్నార్ సింధు శాఖల్లో ఉన్నాయి.

**అండమాన్ నికోబార్ దీవులు:** ఇవి బంగాళాఖాతంలో 10°–14° ఉత్తర అక్షాంశాల మధ్య రెండు ప్రధాన సముదాయాలుగా ఉన్నాయి. అండమాన్ నికోబార్ దీవుల విస్తీర్ణం 8249చ.కి.మీ. అండమాన్ 6,408చ.కి.మీ, నికోబార్ దీవులు 1,841 చ.కి.మీ. మేర వ్యాపించి ఉన్నాయి. అండమాన్, నికోబార్ సముదాయంలో కేవలం 36 దీవుల్లో మాత్రమే జనజీవనం ఉంది. 862 చ.కి.మీ. వైశాల్యంతో గ్రేట్ నికోబార్ అతి పెద్ద దీవి. ఇది భూమధ్యరేఖకు అతి దగ్గరగా ఉంది.

అరేబియా సముద్రంలోని దీవులన్నీ పగడపు ఉద్భవంతో కూడినవి. 32 చ.కి.మీ.ల విస్తీర్ణంతో లక్షదీవులు 8°-11° ఉత్తర అక్షాంశాల మధ్య ఉన్నాయి. వీటికి దక్షిణంగా ఎనిమిది డిగ్రీ ఛానల్‌లో 4–5చ.కి.మీ. వైశాల్యంతో మినికాయ్ దీవి ఉంది. శిలా ఉపరితలమున్న పాంబన్ దీవి భారతదేశం, శ్రీలంక మధ్య ఉంది.

www.sakshieducation.com

## భారతదేశం నైసర్గిక స్వరూపాలు

భారతదేశాన్ని ప్రధానంగా 4 ప్రధాన భూ స్వరూపాలుగా విభజించారు.

- హిమాలయాలు
- గంగా సింధు మైదానం
- ద్వీపకల్ప పీఠభూమి
- తీర మైదానాలు

**హిమాలయాలు:** ఎల్లప్పుడూ మంచుతో కప్పి ఉండటం వల్ల వీటికి హిమాలయాలు అని పేరు వచ్చింది. వీటిని అతి తరుణ ముడుత లేదా నవీన ముడుత పర్వతాలు అంటారు. సంపీడన బలాల వల్ల టెథిస్ సముద్రం పైకి వచ్చి, ప్రస్తు తం ఉన్న హిమాలయ పర్వతాలు ఏర్పడ్డాయి.

రాష్ట్రాల ప్రకారం చూస్తే హిమాలయాలు జమ్మూ కాశ్మీర్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు విస్తరించి ఉన్నాయి. నదుల ప్రకారం గమనిస్తే సింధు, బ్రహ్మపుత్ర నదుల మధ్య విస్తరిం చాయి. హిమాలయాల పొడవు సుమారుగా 2,400 కి.మీ. వెడల్పు జమ్మూ కాశ్మీర్‌లో 500 కి.మీ., అరుణాచల్ ప్రదేశ్ 200 కి.మీ. హిమాలయాలు మొత్తం 5 లక్షల చ.కి.మీ. విస్తీర్ణాన్ని ఆక్రమించాయి. ఇవి వాయువ్యం నుంచి ఆగ్నేయ దిశగా వాలి ఉన్నాయి. వీటిని మూడు సమాంతర శ్రేణులుగా విభజిం చారు.

1. హిమాద్రి లేదా అత్యున్నత హిమాలయాలు
2. హిమాచల్ లేదా మధ్య లేదా నిమ్న హిమాలయాలు
3. శివాలిక్ లేదా బాహ్య హిమాలయాలు

**హిమాద్రి:** హిమాలయ పర్వత శ్రేణులన్నింటికంటే ఇది అత్యున్నతమైంది. దీని సరాసరి ఎత్తు 6,100మీ. ఈ పర్వత శ్రేణిలో ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరాలు ఉన్నాయి. ఎవరెస్ట్ ప్రపంచంలో కెల్లా పెద్ద శిఖరం. ఇది నేపాల్‌లో ఉంది. సిక్కింలో ఉన్న కాంచనగంగ భారత దేశంలో ఎత్తయిన శిఖరం.

మకాలు, ధవళగిరి, మనస్లూ, చోఢీయు, నంగప్రభాత్, అన్నపూర్ణ, నందాదేవి, నామ్చ బర్వా మొదలైనవి హిమాద్రి శ్రేణి లోని కొన్ని ముఖ్య పర్వతాలు. ఇది గ్రానైట్, నీస్, షిస్ట్ వంటి రూపాంతర శిలలతో ఏర్పడింది.

**హిమాచల్:** హిమాద్రికి దక్షిణంగా హిమాచల్ పర్వత శ్రేణి ఉంది. ఈ శ్రేణి ఎత్తు 1000 నుంచి 4,500 మీ. వెడల్పు 60 నుంచి 80 కి.మీ. కాశ్మీర్‌లోని పీర్ పంజాల్ పర్వతశ్రేణి అతి పొడవైంది. హిమాద్రి, పీర్ పంజాల్ శ్రేణి మధ్య కాశ్మీరులోయ ఉంది. ఈ లోయలో ఉన్న సరస్సులు ఊలర్, ధాల్.

పీర్ పంజాల్ పర్వతశ్రేణి నైరుతి భాగాన్ని దౌల్ ధార్ శ్రేణి అంటారు. దీనిలో ప్రసిద్ధ వేసవి విడిది సిమ్లా. దీనిలోనే కులు, కాంగ్రా లోయ లున్నాయి. హిమాచల్ పర్వత శ్రేణిలో సిమ్లా ముస్సోరి, నైనిటాల్, ఛక్రాటా, రాణిఖేత్ వంటి వేసవి విశ్రాంతి స్థావరాలున్నాయి. ఈ పర్వత శ్రేణి సతతహరిత ఓక్, శృంగాకార అడవులతో నిండి ఉంది.

**శివాలిక్:** ఇది హిమాచల్ శ్రేణికి దక్షిణంగా ఉంది. జమ్మూ కాశ్మీర్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు అవిచ్ఛిన్నంగా వ్యాపిం చింది. వీటి ఎత్తు 600మీ. నుంచి 1500మీ. వరకు ఉంది. వెడల్పు హిమాచల్ ప్రదేశ్‌లో అత్యధింగా 50 కి.మీ. అరుణాచ ల్‌ప్రదేశ్‌లో అతి తక్కువగా 15 కి.మీ. ఉంది. ఈ శ్రేణులను జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో జమ్మూ కొండలు అని, అరుణాచల్ ప్రదేశ్‌లో మిష్మి కొండలు అని అంటారు. శివాలిక్ కొండల్లో ఉష్ణమండల తేమతో కూడిన ఆకురాల్చు అడవులు పెరుగుతా యి.

## ట్రాన్స్ హిమాలయ మండలం

హిమాద్రికి ఉత్తరంగా ట్రాన్స్ హిమాలయ మండలం ఉంది. ఈ మండలంలో కారకోరం, లడక్, జస్కర్, కైలాస్, కున్‌లున్, హిందూకుష్, పామీర్ పర్వత శ్రేణులున్నాయి. పామీర్ ప్రపంచంలో ఎత్తయిన పీఠభూమి. దీన్ని ప్రపంచపు పై కప్పు అని కూడా అంటారు. కారకోరం శ్రేణిలో ప్రపంచంలో రెండో ఎత్తయిన శిఖరం $K_2$ (గాడ్విన్- ఆస్టిన్). దీని ఎత్తు 8,611 మీ.

## గంగా – సింధు మైదానం

ఈ మైదానాలు ద్వీపకల్ప పీఠభూమికి, హిమాలయాలకు మధ్య విస్తరించి ఉన్నాయి. సింధు నది ముఖ ద్వారం నుంచి గంగానది ముఖ ద్వారం వరకు వ్యాపించి ఉన్న మైదానాన్ని బృహత్ మైదానం అంటారు. దీని పొడవు 3,200 కి.మీ. వెడల్పు అతి తక్కువగా అసోంలో ఉంది. జార్ఖండ్‌లో 160 కి.మీ., ఉత్తర ప్రదేశ్‌లో 280 కి.మీ వెడల్పు ఉంది.

గంగా – సింధు మైదానంలో నాలుగు ముఖ్యమైన భూ స్వరూపాలున్నాయి. అవి...

1. **భాబర్:** ఇది శివాలిక్ కొండల పాదాల వెంట హిమాలయ నదులు తెచ్చిన గులకరాళ్లు, గ్రావెల్, కంగ్లామరేట్ వంటి వాటితో ఏర్పడిన మండలం. విసనకర్ర ఆకారంలో ఉంటుంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించింది.
2. **టెరాయి:** దట్టమైన అడవులతో కూడిన చిత్తడి ప్రాంతం.
3. **భంగర్:** టెరాయికి దక్షిణంగా ప్రాచీన కాలం లో ఏర్పడిన ఒండలి మైదానాన్ని ‘భంగర్’ అంటారు.
4. **ఖాదర్:** టెరాయికి దక్షిణంగా నవీన కాలంలో ఏర్పడిన ఒండలి మైదానాన్ని ‘ఖాదర్’ అంటారు.

## కల్లార్ లేదా రే

ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో శుష్క ప్రదేశంలో ఉన్న వ్యవసాయానికి పనికిరాని చవుడు, లవణం, స్ఫటిక నేలలను కల్లార్ లేదా రే అంటారు.

ప్రాంతాల వారీగా బృహత్ మైదానాలను కింది విధంగా విభజించారు.

1. పంజాబ్ – హర్యానా మైదానాలు
2. రాజస్థాన్ మైదానాలు
3. గంగా మైదానాలు
4. బ్రహ్మపుత్ర లోయ

## గంగా మైదానాలు

గంగా మైదానం ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. దీని వైశాల్యం 3.75 లక్షల చ.కి.మీ. ఈ మైదానం ఆగ్నేయంగా వాలి ఉంది. గంగ దాని ఉపనదులు యమున, గండక్, గోగ్రా, గోమతి, కోసి, సోన్ నదులు ఈ మైదానంలో ప్రవహిస్తున్నాయి.

మధ్య గంగా మైదానం. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో విస్తరించింది. ఇది భంగర్, ఖాదర్ మైదానాలతో కూడి ఉంది.

**బ్రహ్మపుత్ర లోయ:** బ్రహ్మపుత్ర మైదానం ముఖ్యంగా అసోం రాష్ట్రంలో ఉంది. దీనిలో టెరాయి పరిస్థితులు ఉన్నాయి.

## ద్వీపకల్ప పీఠభూమి

ఇది బృహత్ మైదానాలకు దక్షిణంగా అగ్నిశిలలు, రూపాంతర శిలలతో ఏర్పడింది. దీని వైశా ల్యం 16 లక్షల చ.కి.మీ. దీని సరాసరి ఎత్తు 600మీ.నుంచి 900మీ. ఈ పీఠభూమి పశ్చిమం నుంచి తూర్పునకు వాలి ఉంది. ద్వీపకల్ప పీఠభూమిలో

అవశిష్ట పర్వతాలు ఎక్కువగా ఉన్నాయి.

**ఉదా:** ఆరావళి పర్వతాలు, తూర్పు, పశ్చిమ కనుమలు

**ద్వీపకల్ప పీఠభూమి సరిహద్దులు:** వాయువ్యం లో ఆరావళి పర్వతాలు, ఉత్తరాన బుందేల్ ఖండ్ పీఠభూమి, ఈశాన్యంలో రాజ్‌మహల్ కొండలు, దక్షిణాన పడమటి చివరన పడమటి కనుమలు, తూర్పు చివరన తూర్పు కనుమలు ఉన్నాయి. ఈ ద్వీపకల్ప పీఠభూమిని స్థూలంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. ఉత్తరాన మాల్వా పీఠభూమి, దక్షిణాన దక్కన్ పీఠభూమి. ఈ రెండు పీఠభూములను నర్మదా నది వేరు చేస్తోంది.

**మాల్వా పీఠభూమి:** మాల్వా పీఠభూమికి వాయువ్యంగా ఆరావళి పర్వతాలు, దక్షిణాన వింధ్య పర్వతాలు, ఈశాన్యంలో బుండి కొండ లు ఉన్నాయి. దీనికి తూర్పున ఉన్న భాగాన్ని చోటా నాగపూర్ పీఠభూమి అంటారు. ఇది జార్ఖండ్‌లో ఉంది. చోటా నాగ్‌పూర్ ప్రాంతాన్ని పశ్చిమ జర్మనీలో 'రూర్ ప్రాంతం'తో పోలుస్తారు.

## దక్కన్ పీఠభూమి

**సరిహద్దులు:** ఉత్తరాన సాత్పురా పర్వతశ్రేణి, పశ్చిమాన పశ్చిమ కనుమలు, తూర్పున తూర్పు కనుమలు ఉన్నాయి. ఈ పీఠభూమి ఎత్తు పశ్చిమాన 900 మీ., తూర్పున 300 మీ. దక్కన్ పీఠభూమి పశ్చిమం నుంచి త్రిభుజాకారంలో తూర్పునకు వాలి ఉంది. దక్కన్ పీఠభూమిని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తారు. దక్కన్ పీఠభూమి ఉత్తర, వాయువ్య ప్రాంతాలను మహారాష్ట్ర పీఠభూమి అంటారు. ఇది బసాల్ట్ శిలలతో ఏర్పడింది.

దక్కన్ పీఠభూమి ఆగ్నేయ భాగాన్ని ఆంధ్రా పీఠభూమి అని, దక్షిణ భాగాన్ని కర్ణా టక పీఠభూమి అని పిలుస్తారు. ఇవి ఆర్కియన్, నీస్ శిలలతో ఏర్పడ్డాయి. నర్మద, తపతి నదుల మధ్య సాత్పురా పర్వత శ్రేణి ఉంది. ఈ శ్రేణి తూర్పు భాగాన్ని మైకాల పీఠభూమి అంటారు. సాత్పురా పర్వతాల్లో ఎత్తయిన ప్రాంతం మధ్యప్రదేశ్‌లోని మహదేవ్ కొండల్లో పచ్‌మరి సమీపంలో ఉంది.

## పశ్చిమ కనుమలు

వీటిని సహ్యాద్రి శ్రేణి అని కూడా పిలుస్తారు. ఇవి మహారాష్ట్రలోని ఖందేష్ నుంచి ప్రారంభమై దక్షిణాన కన్యాకుమారి వరకు వ్యాపించి ఉన్నాయి. గ్రానైట్, నీస్ వంటి కఠిన శిలలతో ఏర్పడ్డాయి. నీలగిరి కొండలు, సహ్యాద్రి కొండలు గడలూరు సమీపంలో కలుస్తున్నాయి. నీలగిరి కొండల్లో ఎత్తయిన శిఖరం ఉదక మండలం సమీపంలో ఉన్న దొడబెట్ట(2637మీ.). కేరళలోని అన్నామలై కొండల్లోని అనైముడి శిఖరం(2695మీ.) ద్వీపకల్ప పీఠభూమిలో ఎత్తయినది.

## తూర్పు కనుమలు

తూర్పు కనుమలు ఉత్తరాన చోటా నాగపూర్ పీఠభూమి, దక్షిణాన నీలగిరి కొండలతో కలుస్తున్నాయి. ఇవి చార్నొకైట్, ఖోండలైట్ వంటి శిలలతో ఏర్పడ్డాయి. వీటిని ఉత్తర భాగంలో 'ఉత్తర కొండలు', దక్షిణ భాగంలో 'తమిళనాడు కొండలు', మధ్య భాగంలో 'కడప శ్రేణులు'గా పేర్కొంటారు. తూర్పు కనుమల్లో అతి ఎత్తయిన స్థలం (1506మీ) విశాఖపట్నం జిల్లాలో, రెండో ఎత్తయిన స్థలం ఒడిశాలోని గంజాం జిల్లాలోని మహేంద్రగిరి (1501మీ)లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో నల్లమల కొండలు, పాల కొండలు, వెలి కొండలు, ఎర్రమల కొండలు, శేషాచలం కొండలు తూర్పు కనుమల్లో అంతర్భాగం.

## తీర మైదానాలు

భారతదేశంలో తీర మైదానాలను రెండు భాగాలుగా విభజించవచ్చు.

1. పశ్చిమ తీర మైదానం
2. తూర్పు తీర మైదానం

**పశ్చిమ తీర మైదానం:** గుజరాత్‌లోని రాణా ఆఫ్ కచ్ నుంచి తమిళనాడులోని కన్యాకుమారి వరకు విస్తరించి ఉంది. ఈ మైదానాన్ని వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తారు.

గుజరాత్ – గుజరాత్ తీరం
గోవా, మహారాష్ట్ర – కొంకణ్ తీరం
కర్ణాటక – కెనరా తీరం
కేరళ – మలబార్ తీరం

**తూర్పు తీర మైదానం:** పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడు వరకు విస్తరించి ఉంది.

పశ్చిమ బెంగాల్ – వంగ తీరం
ఒడిశా – ఉత్కల్ తీరం / కళింగ తీరం
ఆంధ్రప్రదేశ్ – సర్కార్ తీరం
తమిళనాడు – కోరమండల్ తీరం

## నదులు

భారతదేశంలోని నదులను స్థూలంగా రెండు ప్రధాన సముదాయాలుగా విభజించవచ్చు.

1. హిమాలయ నదులు
2. ద్వీపకల్ప నదులు

**హిమాలయ నదులు:** గంగా, సింధూ, బ్రహ్మపుత్ర నదులు మొదలైనవి.

**గంగానది:** జన్మస్థానం – హిమాలయాల్లోని గంగోత్రి హిమానీనదం. రెండు ప్రధాన సెలయేర్లు అలకానంద, భగీరథ – దేవ ప్రయాగ వద్ద కలిసి గంగానది ఏర్పడింది. నదుల్లో అతి పొడవైంది గంగానది. ఉత్తరప్రదేశ్ 1450కి.మీ, బీహార్‌లో 445 కి.మీ, పశ్చిమ బెంగాల్‌లో 520 కి.మీలు పొడవున ఈ నది ప్రవహిస్తోంది.

బంగ్లాదేశ్‌లో గంగానదిని పద్మానదిగా పిలుస్తారు. బ్రహ్మపుత్రానది బంగాళాఖాతంలో కలవడానికి ముందు పద్మానదిలో కలుస్తుంది. యమున, గండక్, గోగ్రా, గోమతి, కోసి, శారద, రామగంగ, చంబల్, సోన్, దామోదర్ వంటివి గంగా ఉప నదులు.

గంగానది ఉపనదుల్లో పెద్దది – యమున. గంగా, యమున, సరస్వతి నదుల సంగమం 'త్రివేణి సంగమం'.

**సింధు నది:** దీని జన్మస్థలం టిబెట్‌లోని మానససరోవరం. సింధునది పొడవు 2,880 కి.మీ. భారతదేశంలో దీని పొడవు 709 కి.మీ. ఈ నది చీనాబ్, రావి, జీలం, బియాస్, సట్లెజ్ అనే ఐదు ఉపనదులను కలిగి ఉంది. భారత్‌లో జమ్మూ – కాశ్మీర్ ద్వారా మాత్రమే సింధునది ప్రవహిస్తోంది. సింధునది పాకిస్థాన్‌లోని కరాచి వద్ద అరేబియా సముద్రంలో కలుస్తుంది.

## మాదిరి ప్రశ్నలు

**1. 8°–11° ఉత్తర అక్షాంశాల మధ్య విస్తరించి ఉన్న దీవులు?**

1) అండమాన్ 2) నికోబార్ 3) లక్ష దీవులు 4) మినికాయ్

**2. నీలగిరి కొండల్లో ఎత్తయిన శిఖరం?**

1) రత్నగిరి 2) గురుశిఖర్ 3) దొడబెట్ట 4) అన్నపూర్ణ

3. శివాలిక్ కొండల పాదాల వెంట గులక రాళ్లతో కూడిన సచ్ఛిద్ర మండలాన్ని ఏమంటారు?

1) టెరాయి 2) ఖాదర్ 3) బాబర్ 4) బంగర్

4. జమ్మూ కాశ్మీర్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు వ్యాపించిన బాహ్య హిమాలయాలను ఏమంటారు?

1) హరిత శ్రేణి 2) ఉత్తర శ్రేణి 3) హిమాచల్ శ్రేణి 4) శివాలిక్ శ్రేణి

5. నర్మద, తపతి లోయల మధ్య ఉన్న పర్వత శ్రేణి?

1) వింధ్య 2) సాత్పురా 3) కైమూర్ 4) ఆరావళి

6. హిమాలయ పర్వతాల్లోని కైబర్, బొలాన్ అనేవి?

1) కనుమలు 2) సరస్సులు 3) కొండలు 4) పీఠభూములు

7. మెక్‌మోహన్ రేఖ ఏ రెండు దేశాల మధ్య ఉంది?

1) పాకిస్థాన్ – అఫ్ఘనిస్తాన్ 2) ఇండియా – చైనా
3) ఇండియా – పాకిస్థాన్ 4) భూటాన్ – చైనా

8. భౌగోళికంగా మన దేశంలో చిన్న రాష్ట్రం?

1) గోవా 2) అసోం 3) ఉత్తరప్రదేశ్ 4) హిమాచల్‌ప్రదేశ్

9. నేపాల్ – చైనాల్లో అంతర్జాతీయ సరిహద్దు ఉన్న రాష్ట్రం?

1) అసోం 2) నాగాలాండ్ 3) ఉత్తరప్రదేశ్ 4) సిక్కిం

10. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమంటారు?

1) అలకనంద 2) పద్మ 3) యమున 4) మేఘన

11. భూమధ్యరేఖకు అతి దగ్గరగా ఉన్న భారతదేశ దీవి?

1) గ్రేట్ నికోబార్ 2) అండమాన్ 3) మినికాయ్ 4) లక్షదీవులు

12. బంగాళాఖాతంలో ఉన్న దీవుల సంఖ్య?

1) 247 2) 223 3) 32 4) 36

13. హిమాద్రికి దక్షిణంగా ఉన్న హిమాలయ పర్వతశ్రేణి?

1) శివాలిక్ 2) అత్యున్నత హిమాలయాలు
3) సహ్యాద్రి 4) హిమాచల్

www.sakshieducation.com

14. ఉత్తరప్రదేశ్, హర్యానా, రాష్ట్రాల్లో శుష్క ప్రదేశాల్లో ఉన్న చవుడు లవణం, స్ఫటిక భూభాగాలను ఏమంటారు?

1) టెరాయి 2) భంగర్ 3) కల్లార్ లేదా రే 4) ఖాదర్

15. అబు కొండల్లోని గురుశిఖర్ ఏ పర్వతశ్రేణిలో ఉంది?

1) వింధ్య 2) ఆరావళి 3) సాత్పురా 4) తూర్పు కనుమలు

16. $K_2$ శిఖరం ఏ హిమాలయ శ్రేణిలో ఉంది?

1) హిమాచల్ 2) హిమాద్రి 3) ట్రాన్స్ హిమాలయాలు 4) శివాలిక్

17. గంగా సింధు మైదానాల విస్తీర్ణం?

1) 5,000 చ.కి.మీ. 2) 7,00,000 చ.కి.మీ. 3) 16,00,000 చ.కి.మీ. 4) 10,000 చ.కి.మీ.

18. పామీర్ పీఠభూమి ఏ హిమాలయాల శ్రేణిలో ఉంది?

1) బాహ్య 2) మధ్య 3) అంతర 4) ట్రాన్స్

19. రాజస్థాన్‌లోని ఖేత్రి గనులు దేనికి ప్రసిద్ధి?

1) ఇనుము 2) వెండి 3) బంగారం 4) రాగి

20. భారతదేశంలో కర్కటరేఖ ఎన్ని రాష్ట్రాల ద్వారా పోతోంది?

1) 7 2) 8 3) 6 4) 9

21. భారతదేశంలో ముందుగా సూర్యోదయం అయ్యే రాష్ట్రం?

1) మేఘాలయ 2) అరుణాచల్ ప్రదేశ్ 3) త్రిపుర 4) హిమాచల్ ప్రదేశ్

22. హిమాలయ పర్వత రాజ్యంగా ప్రసిద్ధి చెందింది?

1) టిబెట్ 2) భూటాన్ 3) చైనా 4) నేపాల్

23. లక్షదీవుల రాజధాని?

1) పుదుచ్చేరి 2) కవరత్తి 3) పోర్ట్‌బ్లెయర్ 4) సిల్వసా

24. భారతదేశం, శ్రీలంక మధ్య ఉన్న దీవి?

1) పాంబన్ 2) మినికాయ్ 3) టెరెస్సా 4) ట్రింకట్

25. కిందివాటిలో కేంద్రపాలిత ప్రాంతం కానిది?

1) పాండిచ్చేరి 2) త్రిపుర 3) లక్షదీవులు 4)దాద్రానగర్ హవేలి

www.sakshieducation.com

### సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1) 3 | 2) 3 | 3) 3 | 4) 4 | 5) 2 | 6) 1 | 7) 2 | 8) 1 |
| 9) 4 | 10) 2 | 11) 1 | 12) 2 | 13) 4 | 14) 3 | 15) 2 | 16) 3 |
| 17) 2 | 18) 4 | 19) 4 | 20) 2 | 21) 2 | 22) 4 | 23) 2 | 24) 1 |
| 25) 2 | | | | | | | |

## 2012 డీఎస్సీలో అడిగిన ప్రశ్నలు

**1. చిలుకా, కొల్లేరు సరస్సుల ద్వారా ప్రవహించే నది?**

1) కృష్ణా 2) గోదావరి 3) బ్రాహ్మణి 4) మహానది

**2. డెహ్రాడూన్ ఏ శ్రేణుల మధ్య ఉంది?**

1) హిమాచల్, హిమాద్రి
2) శివాలిక్, హిమాచల్
3) ట్రాన్స్ హిమాలయ మండలం, హిమాచల్ వరుసల్లో
4) హిమాద్రి, ట్రాన్స్ హిమాలయ మండలం

**3. ఏ నగరాల మధ్య ప్రయాణించే విమానం ఆంధ్రప్రదేశ్ గగనతలంపై ఎగురుతుంది?**

1) భువనేశ్వర్, ఢిల్లీ 2) ముంబై, వారణాసి 3) చెన్నై, పుణే 4) కోజికోడ్, చెన్నై

**4. రేఖాంశాల మధ్య భారతదేశ విస్తృతిని ఏ ప్రాంతాల మధ్య కొలిచారు?**

1) గుజరాత్ నుంచి మిజోరాం వరకు
2) రాజస్థాన్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు
3) రాణా ఆఫ్ కచ్ నుంచి మిజోరాం వరకుట
4) రాణా ఆఫ్ కచ్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు

### సమాధానాలు

1) 2 2) 2 3) 4 4) 4

www.sakshieducation.com